నీటిఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు



సీజీఎం ప్రభుకు మెమోరాండం అందిస్తున్న దృశ్యం

అబిడ్స్‌: గోషామహల్‌ నియోజకవర్గంలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మెట్రో వాటర్‌బోర్డు సీజీఎం ప్రభు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో మెరుగైన తాగునీటి సరఫరా, బోర్‌వెల్స్‌ మరమ్మతులు, ఇతర తాగునీటి ఎద్దడి సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గురువారం గోషామహల్‌ నియోజకవర్గం బీఆర్‌ఎస్‌ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్‌ ఆయనను కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా సీజీఎం ప్రభు మాట్లాడుతూ..సంబంధిత అధికారులు అన్ని ప్రాంతాల్లో పర్యటించి తాగునీటి సమస్యలు పరిష్కరిస్తానని వివరించారు.

మాదిగలకు అదనంగా రెండు మంత్రి పదవులు ఇవ్వాలి



మెమొరాండం చూపిస్తున్న బోయిని ఎల్లేష్‌ మాదిగ

అబిడ్స్‌: రాష్ట్ర మంత్రి మండలిలో మరో రెండు మంత్రి పదవులను మాదిగలకు కేటాయించాలని ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని ఎల్లేష్‌ మాదిగ డిమాండ్‌ చేశారు. గురువారం ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర నాయకులు బొబ్బిలి జనార్దన్‌ మాదిగ, ఇంద్రాల శేఖర్‌ మాదిగ, దర్శనం రామస్వామి మాదిగ, అనిల్‌ మాదిగ, అమరేందర్‌ మాదిగతో కలిసి గాంధీ వన్‌లోని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌ గౌడ్‌ కార్యాలయంలో మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లేష్‌ మాదిగ మాట్లాడుతూ..తెలంగాణలో 70 లక్షల మంది జనాభా ఉన్న మాదిగలకు జనాభా దామాషా ప్రకారం అదనంగా మరో రెండు మంత్రి పదవులు ఇవ్వాలని పేర్కొన్నారు. గత అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికల్లో మాదిగలంతా కాంగ్రెస్‌ పార్టీ గెలుపునకు కృషి చేశారని ఆయన పేర్కొన్నారు.

రంజాన్‌ కిట్ల పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న మహ్మద్‌ జాకేర్‌

గోల్కొండ: నిరుపేదలు, సఫాయి కార్మికులు, ఆశా వర్కర్లకు గురువారం గోల్కొండ కటోరా హౌస్‌ వద్ద నిత్యావసర, రంజాన్‌ కిట్లను పంపిణీ చేశారు. గోల్కొండ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి మహ్మద్‌ జాకేర్‌ 300 మందికి నిత్యావసర వస్తువులు, రంజాన్‌ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..20 ఏళ్లుగా విరామం లేకుండా గోల్కొండ, లంగర్‌హౌస్‌, కార్వాన్‌ తదితర ప్రాంతాల్లో తాము రంజాన్‌ మాసంలో నిరుపేద ముస్లింలకు రంజాన్‌ కిట్లు, ఆశా వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్‌ నాయకులు అద్నాన్‌ ఖాన్‌ తదితరులున్నారు.

వైస్‌ చాన్సలర్‌ ఖోఖో చాంపియన్‌గా జీఎన్‌ఐటీఎస్‌ టీమ్‌



గోల్కొండ: తమ కళాశాల కేవలం విద్యాబోధనలోనే కాకుండా క్రీడల్లోనూ విశేషంగా రాణిస్తుందని షేక్‌పేట్‌ జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్‌ కళాశాల వైస్‌ చైర్‌ పర్సన్‌ జి.శ్రీవిద్యారెడ్డి అన్నారు. గురువారం కూకట్‌పల్లి జేఎన్‌టీయూహెచ్‌లో జరిగిన వైస్‌ చాన్సలర్‌ ఖోఖో చాంపియన్‌షిప్‌లో జీఎన్‌ఐటీఎస్‌లో టీమ్‌ విజేతగా నిలిచింది. మొత్తం టోర్నమెంట్‌లో మీనాక్షి ఖోఖోలో అత్యుత్తమ ఆల్‌రౌండర్‌గా, మనస్విని ఉత్తమ రన్నర్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమ విద్యార్థినులు ఇష్టపడే క్రీడల్లో అత్యుత్తమ కోచ్‌లతో శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు.

కో ఆపరేటివ్‌ అపెక్స్‌ బ్యాంక్‌ ఎండీగా కృష్ణారావు



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్‌ అపెక్స్‌ బ్యాంక్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌గా వై.కృష్ణారావు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం అబిడ్స్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా అపెక్స్‌ బ్యాంక్‌ చైర్మన్‌ ఎం.రవీందర్‌రావు ఆయనను కలిసి అభినందించారు. అదేవిధంగా సహకార సంఘ 24వ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీజీసీఏబీ డైరెక్టర్లు కొత్త కురుమ సత్తయ్య, కుంబం శ్రీనివాస్‌రెడ్డి, నాబార్డ్‌ సీజీఎం ఉదయ్‌భాస్కర్‌, సహకార సంఘం సీజీఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ కోట కందకాలు మాయం!

- కందకాల్లో యథేచ్ఛగా వ్యర్థాల డంపింగ్‌
- పట్టించుకోని కోట, ఇతర ప్రభుత్వ అధికారులు



గోల్కొండ ఫతేదర్వాజ కందకంలో వ్యర్థాలు

గోల్కొండ: గోల్కొండ కోటకు రక్షణగా ఉన్న కందకాలు ఒకొక్కటిగా కబ్జా చేయడానికి కబ్జాదారులు పక్కా స్కెచ్‌తో ముందుకు సాగుతున్నారు. గోల్కొండ కోటకు చుట్టూ ఉన్న ప్రహరీకి లోతైన కందకాలు ఉన్నాయి. గోల్కొండ కోటపైకి దండయాత్రకు వచ్చే వారు కోట గోడలను ఎక్కకుండా ఈ కందకాలను ఏర్పాటు చేశారు. నేడు కబ్జాదారుల కోరల్లో చిక్కుకొని ఒకొక్కటిగా మాయం అవుతున్నాయి. గోల్కొండ మోతీదర్వాజ, ఫతేదర్వాజా, జమాలి దర్వాజా, బంజారి దర్వాజాలకు ఇరువైపులకు ఆనుకొని ఉన్న కందకాల్లో టన్నుల కొద్ది వ్యర్థాలు ఇక్కడికే డంప్‌ అయ్యాయి. కందకాలకు ఆనుకొని వేసిన ఫెన్సింగ్‌ అక్కడక్కడ మాత్రమే కానవస్తుంది. మోతీ దర్వాజాను ఆనుకొని ఉన్న కందకంలో భారీ బండరాళ్లు, శిథిలమైన భవనాల వ్యర్థాలు డంప్‌ చేసి కందకాన్ని కబ్జాదారులు చదును చేస్తున్నారు.

కందకాలు చదును చేసి..

జమాలి దర్వాజా నుంచి ఎండి లైన్స్‌ మీదుగా నయాకీల వరకు ఉన్న కందకంలో సైతం యథేచ్ఛగా వ్యర్థాలు, పాడైపోయిన వివిధ రకాల వస్తువులు డంప్‌ చేస్తున్నారు. నయాకీల కందకంలో ఖాళీగా ఉన్న స్థలంలో ఒక్క నీటి చుక్క సైతం లేదు. అదే విధంగా ఫతేదర్వాజాను ఆనుకొని ఉన్న కందకాలు చదును చేసి ఆ ప్రదేశంలో ఇళ్ల నిర్మాణానికి గుట్టుచప్పుడు కాకుండా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మోతీదర్వాజా నుంచి ఫతేదర్వాజాకు ఉన్న ప్రహరీని ఆనుకొని ఉన్న కందకాలను చదును చేసి కచ్చా ఇళ్లు ఇప్పటికే వెలిశాయి. ముందుగా కచ్చా ఇళ్ల నిర్మాణం చేసి తర్వాత వాటిని కూల్చివేసి బంగళాలు నిర్మించడానికి కబ్జాదారులు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. దిలావర్‌షా నగర్‌ ప్రహరీని ఆనుకొని ఉన్న కందకాలు కూడా ఎప్పుడో వ్యర్థాలు నింపి చదును చేశారు. దిలావర్‌షా నగర్‌, మోతీదర్వాజా, బంజారి దర్వాజా తదితర ప్రాంతాల్లో ప్రహరీని ఆనుకొని ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. మోతీదర్వాజా వద్ద భారీ సైజు దర్వాజా గోడను ఓ వ్యక్తి తన ఇంటి గోడగా మార్చుకొని రెండు అంతస్తుల నిర్మాణాన్ని నిర్మించాడు.

అధికారులు ఎక్కడ..?

కందకాల్లో వ్యర్థాల డంపింగ్‌ జరుగుతున్నా బల్దియా అధికారులు పట్టించుకోవడం లేదు. పారిశుద్ధ్య సిబ్బంది టన్నుల కొద్ది వ్యర్థాలను తెచ్చి జమాలి దర్వాజాలోని కందకంలో డంప్‌ చేస్తున్నారు. గోల్కొండ, టోలిచౌకీ, నదీమ్‌ కాలనీ తదితర ప్రాంతాల్లో సేకరించిన చెత్తను చెత్త వాహనాలు డంపింగ్‌ యార్డు తరలించకుండా కందకాల్లో డంపింగ్‌ చేస్తున్నరు. గోల్కొండ పర్యవేక్షణను పరిశీలించే సీనియర్‌ పరిరక్షణ అధికారి కార్యాలయం గోల్కొండ కోటలోనే ఉంది. చారిత్రక కట్టడాల పరిధిలో ఇళ్లు నిర్మిస్తే అధికారులు అటువంటి ఇళ్ల యజమానులకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. అయితే కబ్జాదారులతో అధికారులు కుమ్మక్కయ్యారని ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

ప్రతి నిత్యం ఖురాన్‌ పఠించాలి



సాక్షి, సిటీబ్యూరో: ఖురాన్‌ను ప్రతినిత్యం పఠించాలని ఈజిప్ట్‌ జామియా హజార్‌ యూనివర్సిటీ ఇస్లామిక్‌ స్కాలర్స్‌ షేక్‌ ఇస్మాయిల్‌, షేక్‌ నూర్‌ సూచించారు. గురువారం బషీర్‌బాగ్‌లోని మీడియా ప్లేస్‌లో ఏర్పాటు చేసిన ఖురాన్‌ పారాయణ కార్యక్రమంలో వారు పాల్గొని ఖురాన్‌ పవిత్రతను వివరించారు. పవిత్ర రంజాన్‌ మాసంలో ఖురాన్‌లో పేర్కొన్న విధంగా ఆచరించాల్సిన నియమ నిబంధనలను, విసర్జించాల్సిన విషయాలపై అవగాహన కల్పించారు. దివ్య ఖురాన్‌ అవతరణ దాని ఉద్దేశాలు, రంజాన్‌ ఉపవాసల గురించి ప్రత్యేకంగా వివరించారు. మీడియా ప్లస్‌ సీఈఓ సయ్యద్‌ ఖాలేద్‌ పర్వేజ్‌ మాట్లాడుతూ..ఏటా రంజాన్‌ పవిత్ర మాసంలో ఖురాన్‌ పారాయణం దాని విశిష్టత గురించి తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగానే నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు రచయితల కవి సాహిత్య భూషణ్‌ గ్రహీత మహమ్మద్‌ అబ్దుల్‌ రషీద్‌ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ సెక్యులర్‌ పార్టీ: మిత్ర కృష్ణ



ఇఫ్తార్‌ పార్టీలో మిత్ర కృష్ణ

గోల్కొండ: కాంగ్రెస్‌ ఆవిర్భావంతోనే సెక్యులర్‌ పార్టీగా పుట్టి ముందుకు సాగుతుందని మాజీ కార్పొరేటర్‌, కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు మిత్ర కృష్ణ అన్నారు. గురువారం ఆయన సంతోష్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఇఫ్తార్‌ పార్టీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌ నగర సంస్కృతిలో ఇఫ్తార్‌ విందులు ఒక భాగం అని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా హైదరాబాద్‌లో మాత్రమే హిందూ ముస్లిం సోదరుల మధ్య పటిష్టమైన స్నేహ సంబంధాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్‌ ముదిరాజ్‌, అస్లాం, మోహన్‌, మాజిద్‌, స్థానికులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్‌ వేడుకలు



ఇఫ్తార్‌ వేడుకల్లో ప్రదీప్‌రాజ్‌ తదితరులు

అఫ్జల్‌గంజ్‌: మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్‌ వేడుకలు దోహదపడుతాయని బేగంబజార్‌ డివిజన్‌ బీఆర్‌ఎస్‌ ప్రధాన కార్యదర్శి కోళ్ల ప్రదీప్‌రాజ్‌ పేర్కొన్నారు. గురువారం మైనార్టీ నాయకులు వహీద్‌ఖాన్‌, మహ్మద్‌ రవూఫ్‌, ఇమ్రాన్‌ఖాన్‌, ఫిరోజ్‌ఖాన్‌, ఎజాజ్‌ఖాన్‌, మహ్మద్‌ సల్మాన్‌ఖాన్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌ విందులో ఆయన పాల్గొన్నారు. అనంతరం ప్రదీప్‌ రాజ్‌ మాట్లాడుతూ..గోషామహల్‌ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ ఎంతో పటిష్టంగా ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. ఈ కార్యక్రమంలో శివశంకర్‌ శర్మ, విష్ణువర్ధన్‌, శివరామ్‌ పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ మహ్మద్‌ వసీవుద్దీన్‌

యాకుత్‌పురా: రంజాన్‌ను పురస్కరించుకొన్ని స్థానిక ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని రెయిన్‌బజార్‌ కార్పొరేటర్‌ మహ్మద్‌ వసీవుద్దీన్‌ తెలిపారు. డివిజన్‌ పరిధిలోని మదీనానగర్‌, ధోబీఘాట్‌, ఎస్‌ఆర్టీ కాలనీ తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించి స్థానికంగా కొనసాగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ నెల 31న రంజాన్‌ సందర్భంగా స్థానిక ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రత్యేక ప్రార్థనలకు వచ్చే వారి కోసం మసీదుల వద్ద ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

రైళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ జావీద్‌

నాంపల్లి: రైళ్లల్లో ప్రయాణికుల లగేజీలు, సెల్‌ఫోన్లను దొంగలించే ఓ నేరస్తుడిని నాంపల్లి జీఆర్పీ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం నాంపల్లిలోని జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సికింద్రాబాద్‌ అర్బన్‌ డీఎస్పీ ఎస్‌.ఎన్‌.జావీద్‌, స్థానిక ఇన్‌స్పెక్టర్‌ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా యాలాల్‌ మండలం, జక్కిపల్లికి చెందిన వడిచెర్ల బసప్ప కుమారుడు వడిచెర్ల రాజు(37) మేస్త్రీ. తాగుడుకు బానిసైన రాజు రైళ్లల్లో ప్రయాణిస్తూ ప్రయాణికుల బ్యాగులు, సెల్‌ఫోన్లు, ఇతరత్రా విలువైన వస్తువులు దొంగలించి పారిపోతాడు. నిజామాబాద్‌ నుంచి లింగంపల్లి మీదుగా తిరుపతికి రాకపోకలు సాగించే రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ రైలును ఎంచుకుని దొంగతనాలకు పాల్పడుతుంటాడు. ఈ నెల 21న కడప జిల్లాకు చెందిన షేక్‌ మహ్మద్‌ షరీఫ్‌ రాజంపేట నుంచి లింగంపల్లికి ప్రయాణిస్తుండగా సెల్‌ఫోన్లు, బ్యాగులు కనిపించకుండా పోయాయి. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును చేపట్టారు. లింగంపల్లి రైల్వేస్టేషన్‌ ప్లాట్‌ఫారం-1 మీద నిల్చున్న రాజును అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లుగా ఒప్పుకున్నారు. దీంతో అతడి వద్ద నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రెండు బ్యాగులు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకుని సీజ్‌ చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడిపై వికారాబాద్‌ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు, తాండూరు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రెండు చోరీ కేసులు నమోదై ఉన్నట్లు తెలిపారు.

తోటల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి

దూద్‌బౌలి: తోటల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఉద్యానవన అధికారి బి.మంగ అన్నారు. పాతబస్తీలోని డాన్‌ హైస్కూల్‌లో గురువారం ఆమె ఉద్యానవనాల ప్రాముఖ్యతపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తోటల పెంపకంపై విద్యార్థులు ఆసక్తి కనబరచాలని ఆమె పిలుపునిచ్చారు. తోటల పెంపకంతో దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతి సాధిస్తుందని, దీంతోపాటు పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. స్వయంగా తోటలు పెంచడంతో నాణ్యమైన ఫలాలను పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా ఆమె మొక్కలు నాటడం, పచ్చదనం ప్రాముఖ్యతను విద్యార్థులతో చర్చించారు. ఆరోగ్యకరమైన సాగు మొక్కల పెంపకంలో వినూత్న ఆలోచనలను ఆమె పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో డాన్‌ విద్యా సంస్థల చైర్మన్‌ ఫజల్‌ ఉర్‌ రహ్మాన్‌ ఖుర్రం, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



లంగర్‌హౌస్‌: సెయింట్‌ జోసెఫ్‌ డిగ్రీ అండ్‌ పీజీ కళాశాల ఉత్తమ విద్యార్థినిగా చెరుకుల దీప్తి అవార్డు అందుకున్నారు. కింగ్‌ కోఠిలోని సెయింట్‌ జోసెఫ్స్‌ డిగ్రీ అండ్‌ పీజీ కళాశాల వార్షికోత్సవం, విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా లంగర్‌హౌస్‌ చెందిన దీప్తికి ఉత్తమ విద్యార్థిని అవార్డును అందజేశారు. దీనికి తోడు ఎస్‌పీటీఈఎల్‌ 2024–25 పరీక్షల్లో దీప్తి సిల్వర్‌ మెడల్‌ అందుకున్నారు. ఉత్తమ ప్రతిభను చూపిని ఆమెకు కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో షబ్‌-ఏ-ఖదర్‌

చార్మినార్‌: ముస్లిం సోదరులు షబ్‌–ఏ–ఖదర్‌ వేడుకలను గురువారం రాత్రి భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. రంజాన్‌ మాసంలో ఎంతో విలువైన రాత్రిగా భావించి రాత్రంగా జాగరణ చేశారు. గురువారం సాయంత్రం ఇఫ్తార్‌ విందులు ముగించుకున్న ముస్లింలు ఈ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. రాత్రంతా జాగరణ చేస్తూ పవిత్ర ఖురాన్‌ పఠనం చేశారు. మక్కా మసీదులో ముస్లింలు రాత్రి 8 గంటలకు ఇషా నమాజ్‌ నిర్వహించారు. అనంతరం ముస్లిం మత పెద్దలు ఖురాన్‌లోని ముఖ్యమైన ఘట్టాలను చదివి వినిపించారు. రంజాన్‌ మాసంలో ఆకాశ (స్వర్గ) ద్వారాలు తెరుచుకుంటాయని ప్రతీతి. ఉపవాస దినాల్లోని షబ్‌–ఏ–ఖదర్‌ (విలువైన రాత్రి)గా విశ్వసిస్తారు. అందుకే రాత్రిపూట జాగరణ చేస్తూ మసీదులలో ఎక్కువగా గడపడానికి ఇష్టపడుతారు. ఈ విలువైన (షబ్‌–ఏ–ఖదర్‌) రాత్రి ఎవరైతే దైవం వైపునకు మరలి ఆయన ఆరాధనలో సంపూర్ణంగా లీనమవుతారో వారు గొప్ప శుభాలు పొందినవారవుతారని ముస్లింల ప్రగాఢ నమ్మకం.



ఆకట్టుకున్న సంకీర్తన సౌరభం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పోలేటి పార్వతీశం తదితరులు

గన్‌ఫౌండ్రీ: శ్రీరామ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం రవీంద్రభారతిలో శ్రీమాన్‌ తాళ్లపాక అన్నమాచార్య 522వ వర్ధంతి మహోత్సవాలను పురస్కరించుకొని సప్తగిరీశ, సంకీర్తన సౌరభం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ..అన్నమాచార్య సంకీర్తనలు ఎంతో వినసొంపుగా ఉన్నాయని కొనియాడారు. అంతకు ముందు విశారథ గరికపాటి వెంకట్‌ ఆధ్వర్యంలో గాయని గాయకులు ఆలపించిన అన్నమయ్య సంకీర్తనల సహిత గాత్ర ఘోష్ఠి ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అన్నమాచార్య సంకీర్తనలపై ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి సుధామ, గేయ రచయిత కృష్ణమోహన్‌, చిత్రకారులు కూచి, సేవాసంస్థ వ్యవస్థాపకులు చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.

ముగిసిన రసరంజని నాటకోత్సవాలు



అజయ్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న అలేఖ్య పుంజాల తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రముఖ నాటకరంగ సంస్థ రసరంజని 32వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మూడు రోజులుగా రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న రసరంజని నాటకోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా తెలంగాణ సంగీత నాటక అకాడమి చైర్మన్‌ అలేఖ్య పుంజాల మాట్లాడుతూ..నాటక రంగం ఎంతో విలువలు, క్రమశిక్షణతో కూడిన రంగం అని తెలిపారు. నాటక రంగంలో యువతను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. అంతకు ముందు రంగస్థల దర్శకుడు ఆర్‌.వాసు ఆధ్వర్యంలో ప్రదర్శించిన ధర్మోరక్షతి అనే నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. అనంతరం రసరంజని రంగస్థల యువ పురస్కారాన్ని మంకెనపల్లి అజయ్‌కి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు బీఎస్‌ఎన్‌ మూర్తి, సీనియర్‌ పాత్రికేయులు రెంటాల జయదేవ్‌, రసరంజని ఉపాధ్యక్షులు డి.రామకోటేశ్వర్‌రావు, విజయభాస్కర్‌, కార్యదర్శి కె.నటరాజ్‌, కోశాధికారి మోహన్‌ సేనాపతి పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణ తలంబ్రాల బుకింగ్‌ ప్రారంభం



పోస్టర్‌ను, తలంబ్రాల అడ్వాన్స్‌ బుకింగ్‌ను ప్రారంభిస్తున్న వెంకటేశ్‌ తదితరులు

చాంద్రాయణగుట్ట: తెలంగాణ ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంటి వద్దకే రాములోరి తలంబ్రాలు కార్యక్రమాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకుడు, చార్మినార్‌ నియోజకవర్గం కాంగ్రెస్‌ పార్టీ మాజీ ఇన్‌చార్జి వెంకటేశ్‌ పిలుపునిచ్చారు. వచ్చే నెల 6న భద్రాచలంలో జరగనున్న సీతారాముల కల్యాణానికి వెళ్లలేని భక్తులకు ఇళ్ల వద్దకే రాములోరి తలంబ్రాలను అందజేసేందుకు టీజీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్స్‌ వారి సౌజన్యంతో ఏర్పాట్లు చేసింది. పాతబస్తీ అలియాబాద్‌ రాజన్నబావి సమీపంలోని సాయిబాబా ఆలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్‌ ముఖ్యఅతిథిగా హాజరై సీతారాముల కల్యాణ తలంబ్రాల పోస్టర్‌ను, తలంబ్రాల అడ్వాన్స్‌ బుకింగ్‌ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫలక్‌నుమా డిపో ఆధ్వర్యంలో కేవలం రూ.151 మాత్రమే చెల్లించి ప్రముఖ ఆలయాల వద్ద, ఎంజీబీఎస్‌లోని కార్గో పార్శిల్‌ బుకింగ్‌ కౌంటర్‌లో భక్తులు తలంబ్రాల కోసం బుకింగ్‌ చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కమిటీ సెక్రటరీ శ్రీనివాస్‌ రెడ్డి, ఫలక్‌నుమా డిపో మార్కెటింగ్‌ ఎగ్జిక్యూటీవ్‌ జి.సతీష్‌ కుమార్‌, అధికారి సాయికృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ హయాంలోనే మహిళలకు న్యాయం



కాంగ్రెస్‌ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సుజాత గుప్తా తదితరులు

గోల్కొండ: కాంగ్రెస్‌ హయాంలోనే తెలంగాణలో మహిళలకు సంపూర్ణ న్యాయం జరుగుతుందని ఆర్య వైశ్య సంఘం రాష్ట్ర చైర్‌ పర్సన్‌ కల్వ సుజాత గుప్తా అన్నారు. గురువారం కార్వాన్‌ సబ్జిమండిలో కాంగ్రెస్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఎన్నికల హామీలలో మహిళలకు ఇచ్చిన హామీలు సీఎం రేవంత్‌రెడ్డి ఒకొక్కటిగా నెరవేరుస్తున్నారన్నారు. మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రారంభించి వాటిని కాంగ్రెస్‌ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తుందన్నారు. కార్వాన్‌ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ కార్వాన్‌ ఇన్‌చార్జి ఉస్మాన్‌ బిన్‌ మహ్మద్‌ అల్‌ హజరి, మహిళా కాంగ్రెస్‌ ఇన్‌చార్జి మామిడి మాధవి, మలక్‌పేట్‌ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి మహ్మద్‌ ఖాదీర్‌ తదితరులున్నారు.

ఆశాలకు కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు చేయాలి



ఎన్‌హెచ్‌ఎం చీఫ్‌ ప్రోగ్రామింగ్‌ ఆఫీసర్‌ పద్మజాకు వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు

సుల్తాన్‌బజార్‌: తెలంగాణలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు 8 గంటలకు పైబడి పనులు చేయించుకుంటూ పనికి తగిన జీతం ఇవ్వకుండా గౌరవ వేతనం, ఫిక్స్‌డ్‌ వేతనం అంటూ దాటవేస్తూ కాలం గడుపుతున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ విమర్శించారు. గురువారం కోఠిలోని డీహెచ్‌ క్యాంపస్‌ తెలంగాణ రాష్ట్ర ఆశా వర్కర్స్‌ యూనియన్‌ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఎన్‌హెచ్‌ఎం చీఫ్‌ ప్రోగ్రామింగ్‌ ఆఫీసర్‌ పద్మజాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆశాలకు కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు చేయాలన్నారు. ఫలితాల ఆధారిత పారితోషికంగా నియమించుకున్న ఆశాలను ప్రస్తుతం 8 గంటల పైబడి విధులు చేయించుకుంటున్నారని, సామాజిక ఆరోగ్య కార్యకర్తలకు సామాజిక భద్రత లేకుండా ఉన్నదని నిబంధనల ప్రకారం..పీఎఫ్‌, ఈఎస్‌ఐ కనీస వేతనాలు అమలు చేయాల్సి ఉన్నా అమలు చేయకుండా పనులు మాత్రం చేయించుకుంటూ జీతాలు చెల్లించే విషయంలో దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారని వారు అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నందూరి కరుణకుమారి, ఆశావర్కర్స్‌ యూనియన్‌ నాయకురాలు కవిత, కె.రజిత, ఎం.సబిత, రేణుక, ఉపేంద్ర, అనిత, ఉమా, రమా తదితరులు పాల్గొన్నారు.

నేడు జుమ్మాతుల్‌ విదా



చార్మినార్‌: జుమ్మాతుల్‌ విదాను పురస్కరించుకొని మక్కా మసీదులో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. రంజాన్‌ మాసంలో వచ్చే చివరి శుక్రవారాన్ని 'జుమ్మాతుల్‌ విదా'అంటారు. ఈ నెల 28న నిర్వహించే జుమ్మాతుల్‌ విదా (అల్‌ విదా జుమ్మా) సందర్భంగా ముస్లింలు మక్కా మసీదులో సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తారు. భక్తిశ్రద్ధలతో జరిగే ఈ ప్రార్థనలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా మక్కా మసీదు సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 12.30 గంటలకు హజా అనంతరం 12.45 గంటలకు ఖుద్బా కార్యక్రమం జరుగుతుంది. 1.10 గంటలకు సామూహిక ప్రార్థనలు ప్రారంభమవుతాయి. మక్కా మసీదు కతీబ్‌ రిజ్వాన్‌ ఖురేషీ సామూహిక ప్రార్థనలు చేయించనున్నారు. మక్కా మసీదు ప్రాంగణంతో పాటు చార్మినార్‌, చార్‌కమాన్‌, గుల్జార్‌హౌజ్‌, లాడ్‌బజార్‌, సర్దార్‌ మహల్‌ తదితర రోడ్లపై శుక్రవారం ఉదయం కార్పెట్లను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే చార్మినార్‌–మక్కా మసీదు దారిలో ట్రాఫిక్‌కు ఎలాంటి అనుమతి లేదు. అంతేకాకుండా చార్మినార్‌ కట్టడం నలువైపుల వాహనాలకు నో ఎంట్రీ అమలులో ఉండడంతో ఇక శుక్రవారం జుమ్మాతుల్‌ విదా ప్రార్థనల సందర్భంగా ఇతర దారుల్లో ట్రాఫిక్‌ పోలీసులు వాహనాలను దారి మళ్లించనున్నారు. ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు.

నేడు అల్విదా జుమ్మా సామూహిక ప్రార్థనలు

శాలిబండ: రంజాన్‌ మాసాన్ని పురస్కరించుకొని మక్కా మసీదులో శుక్రవారం జుమాత్‌–ఉల్‌–విదా సందర్భంగా సామూహిక ప్రార్థనలు (నమాజ్‌–టీ–జుమ్మా) నిర్వహించిన అనంతరం మక్కా మసీదులో 'జల్సా యముఖ్‌ యోముల్‌–ఖురాన్‌' సభను ఏఐఎంఐఎం ఆధ్వర్యంలో నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సామూహిక ప్రార్థనల్లో మజ్లిస్‌ పార్టీ అధినేత, హైదరాబాద్‌ ఎంపీ అసదుద్దీన్‌ ఒవైసీ, ఫ్లోర్‌ లీడర్‌ అక్బరుద్దీన్‌ ఒవైసీ పాల్గొని ప్రత్యేక ప్రసంగం చేస్తారన్నారు. ఈ సందర్భంగా మజ్లిస్‌ ప్రధాన కార్యదర్శి సయ్యద్‌ అహ్మద్‌ పాషా ఖాద్రీ, మౌలానా సయ్యద్‌ జహీర్‌ ఉద్దీన్‌ అలీ సూఫీ ఖాద్రీ సాహబ్‌ కూడా ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్‌ పార్టీ చార్మినార్‌ ఎమ్మెల్యే మీర్‌ జుల్ఫేకర్‌ అలీ హాజరు కానున్నారని తెలిపారు.